


పెండింగ్ సమస్యల పరిష్కారం

తిరుపతి ఐఐటీకి సంబంధించిన పెండింగ్ సమస్యలను సత్వరం పరిష్కరిస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. - 8లో



వైభవంగా పార్వేట ఉత్సవం

శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి పార్వేట ఉత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. - 8లో



శోభాయమానం

గూడూరు పట్టణంలో శనివారం జగన్నాథ రథయాత్ర శోభాయమానంగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. - 8లో

న్యూస్‌రీల్

తిరుపతి ఎస్పీగా సుబ్బరాయుడు



తిరుపతి నూతన ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైమ్: తిరుపతి జిల్లా నూతన ఎస్పీగా సుబ్బరాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఏపీ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న హర్షవర్ధన్‌రాజును కడప జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు. సుబ్బరాయుడు ఏపీ ప్రభుత్వం ఇంటర్ క్యాడర్ కింద తెలంగాణ నుంచి ఇటీవల ఏపీకి బదిలీపై వచ్చారు. మూడేళ్ల పాటు డిప్యూటేషన్ పై విధులు నిర్వహించనున్నారు. ఏపీలో తొలి పోస్టింగ్ తిరుపతిలో చేయనున్నారు. గతంలో చంద్రబాబు నాయుడు ఓఎస్డీగా పనిచేసిన అనుభవం కూడా ఆయనకు ఉంది. అదేవిధంగా టీటీడీ సీవీఎస్వో నరసింహకిషోర్‌ను ఈస్ట్ గోదావరి జిల్లా ఎస్పీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. తిరుమల సీవీఎస్వో పోస్టు ఇంకా భర్తీ చేయలేదు.

స్విమ్స్‌లో డేటా ఎంట్రీ పోస్టుకు దరఖాస్తులు

తిరుపతి(తుడా): తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రిలో తాత్కాలిక ప్రాతిపదికన డేటా ఎంట్రీ పోస్టుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు స్విమ్స్ రిజిస్ట్రార్ అపర్ణబిట్ల తెలిపారు. 35 ఏళ్లలోపు వయస్సు కలిగి, ఏదైనా డిగ్రీతోపాటు పీజీడీసీఏ, డీసీఏ చదివిన అభ్యర్థులు ఆంగ్లంపై పట్టు కలిగి ఉండాలన్నారు. అలాగే డేటా ఎంట్రీలో అనుభవం ఉండాలని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు httpr://svimstpt.ap.nic.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు పొందాలని తెలిపారు. ఈనెల 20న ఉదయం 8 గంటల నుంచి స్విమ్స్‌లోని క్లినికల్ వైరాలజీ విభాగాధిపతి, సీఫార్ బిల్డింగ్, మొదటి అంతస్తు, నర్సింగ్ కాలేజీ వెనుక భాగంలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లను ఉదయం 8 గంటలకు వెరిఫికేషన్ ఉంటుందని.. 9 గంటల నుంచి ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.20 వేల వేతనం అందిస్తారని.. 12 నెలల పాటు కాంట్రాక్టు ప్రాతిపదికన విధులు నిర్వర్తించాలని చెప్పారు. అవసరాన్ని బట్టి 12 నెలల తర్వాత గడువు పొడిగించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

16న శ్రీసిటీలో మెగా ఉద్యోగమేళా

శ్రీసిటీ(సత్యవేడు): శ్రీసిటీ, ఎంప్లాయ్‌బిలిటీ బ్రిడ్జ్ కంపెనీ సంయుక్తంగా ఈనెల 16న శ్రీసిటీలో 'ఫ్లాగ్' (ఫస్ట్ లుక్ అట్ ఆస్పైరింగ్ గ్రాడ్యుయేట్స్) పేరిట మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. స్థానిక సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ రహదారిలోని శ్రీసిటీ బ్రిడ్ సెంటర్‌లో ఉదయం 8.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. అర్హత కలిగిన అభ్యర్థులను శ్రీసిటీ పరిశ్రమలతో అనుసంధానించడం ఈ ఫ్లాగ్ ఉద్యోగ మేళా ప్రధాన ఉద్దేశం. ఇందులో అధునాతన సాంకేతికతను ఉపయోగించి నియామక ప్రక్రియ చేపట్టనున్నారు. 2022, 2023, 2024లో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఇంజినీరింగ్‌లో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులు. వివరాల కోసం ఎంప్లాయ్‌బిలిటీ బ్రిడ్జ్ సోర్సింగ్ హెడ్ ప్రియా కవిచెల్వన్‌కు 73052 54222 నంబర్‌లో ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల:తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండాయి. క్యూ కృష్ణతేజ అతిథిగృహం వద్దకు చేరింది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 63,493 మంది స్వామివారిని దర్శించుకోగా 31,676 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.69 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

గంజాయ్!

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గంజాయి అక్రమ రవాణా చాపకింద నీరులా విస్తరిస్తోంది. గత నెల రోజులుగా విశాఖపట్నం నుంచి విచ్చలవిడిగా రవాణా అవుతోంది. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో గంజాయి బాక్సులు దింపి యువతకు విక్రయించేలా స్మగ్లర్లు ప్లాన్ చేయడం పోలీసులను సైతం విస్మయానికి గురిచేస్తోంది. విద్యాసంస్థలే లక్ష్యంగా గుప్పు గుప్పుమంటూ గం'జాయ్' రాజ్యమేలడం తల్లిదండ్రులను సైతం ఆందోళనలో పడేస్తోంది. ఇటీవల వరుసగా పట్టుబడుతున్న ఘటనలు చూస్తే కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం తేటతెల్లమవుతోంది.



- వైజాగ్ టు బెంగళూరు వయా పలమనేరు
- ఎన్నడూ లేనంతగా పట్టుబడుతున్న గంజాయి
- పూతలపట్టు, రేణిగుంట నుంచి పట్టణాలు, నగరాలకు సరఫరా
- ఉమ్మడి జిల్లా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గంజాయి రవాణా
- గంజాయి మత్తులో స్కూలు బస్సుపై దాడి.. భయాందోళనలో విద్యార్థినులు
- యథేచ్ఛగా తిరుపతికి సరఫరా అవుతున్న గంజాయి

సాక్షి, టాస్క్‌ఫోర్స్: విశాఖపట్నం నుంచి బెంగళూరు, చెన్నైకి గంజాయి అక్రమరవాణా విచ్చలవిడిగా సాగుతోంది. కర్ణాటక, తమిళనాడుకు తీసుకెళ్లే స్మగ్లర్లు మార్గమధ్యంలో ఉన్న తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో వాలిపోతున్నారు. వెళ్తూవెళ్తూ రైల్వే స్టేషన్లలో పరిస్థితిని చూసుకుని అక్కడక్కడా గంజాయిని తోటి స్మగ్లర్లకు అందించి కర్ణాటక, చెన్నైకి వెళ్తున్నట్లు పోలీసు వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అలా శ్రీకాళహస్తి లేదా రేణిగుంట.. అక్కడ వీలుకాకపోతే తిరుపతి, పాకాలలో గంజాయిని దిగుమతి చేస్తున్నారు. అక్కడి నుంచి చిత్తూరు, పలమనేరులో ముందుగా ఏర్పాటు చేసుకున్న స్మగ్లర్లకు అందిస్తారు. ఆయా ప్రాంతాల్లో ఎక్కడా దిగుమతి చేసేందుకు వీలు కాకపోతే వెళ్తున్న రైల్లో నుంచి ముందుగా నిర్ణయించుకున్న నిర్మానుష్య ప్రాంతంలో గంజాయి బస్తాలు పడేస్తారు. అక్కడి నుంచి పూతలపట్టు నియోజకవర్గ పరిధిలోని బండపల్లికి చేరవేస్తారు. అక్కడి నుంచి గంజాయిని తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని పలు ప్రాంతాలకు సరఫరా అవుతున్నట్లు కొందరు చెబుతున్నారు.

గతంలో ఉక్కుపాదం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గంజాయి, మాదకద్రవ్యాలు, ఇసుక, ఎర్రచందనం అక్రమ రవాణాను నిరోధించేందుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)ని ఏర్పాటు చేసింది. సెబ్, పోలీసులు వారి ఆటకట్టించేందుకు దృష్టి సారించారు. ఎక్కడికక్కడ వారిని కట్టడిచేస్తూ వచ్చారు. అందులో భాగంగానే విశాఖ నుంచి బెంగళూరు, చెన్నైకి గంజాయి తరలించే స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపుతూ వచ్చారు. అయితే గత కొద్ది రోజులుగా మళ్లీ గంజాయి రవాణా జోరందుకుంటోంది. దీనిపై పటిష్ట నిఘా లేకపోవడం.. సరైన సమాచారం అందించే నాథుడే లేకపోవడం గమనార్హం.



పోలీసులకు పట్టుబడిన గంజాయి

తిరుపతి జిల్లాలో పట్టుబడ్డ గంజాయి

సంవత్సరం	నమోదైన కేసులు	పట్టుబడ్డ గంజాయి	అరెస్టయిన వారు
2022	68	522 కిలోలు	219
2023	108	1207	491
2024 ఇప్పటి వరకు	33	170	107

నెల రోజుల వ్యవధిలో 32 కిలోల గంజాయి, 15 మందిని అరెస్టు చేశారు

గంజాయి కేంద్రాలు

చిత్తూరు జిల్లాలో : పలమనేరు, పూతలపట్టు, చిత్తూరు, మురకంబట్టు

తిరుపతి జిల్లాలో : పాకాల, చంద్రగిరి, తిరుపతి, రేణిగుంట, శ్రీకాళహస్తి

గంజాయి లభ్యమయ్యే ప్రాంతాలు

రైల్వేస్టేషన్లు, బస్టాండ్ పరిసరాల్లో



స్వాధీనం చేసుకున్న గంజాయి

గంజాయి మత్తులో యువత చిత్తు

యువతను లక్ష్యంగా చేసుకుని స్మగ్లర్లు, విక్రయదారులు గంజాయిని స్నేహితుల ద్వారా వారికి రుచి చూపిస్తారు. మత్తుకు అలవాటు పడ్డ యువత వారి స్నేహితులకు గంజాయిని అలవాటు చేస్తున్నారు. అలా గంజాయికి అలవాటుపడ్డ విద్యార్థులు, అల్లరి చిల్లరగా తిరిగే యువత కొందరు మత్తులో గొడవలకు దిగుతున్నారు. ఇలాంటిదే ఇటీవల తిరుపతి మంగళం పరిధిలో చోటు చేసుకుంది. ఇద్దరు యువకులు గంజాయి మత్తులో ఓ ప్రైవేటు విద్యాసంస్థ బస్సుపై దాడికి తెగబడ్డారు. ఆ బస్సులో ఉన్న విద్యార్థినులు వారి చేష్టలను చూసి భయభ్రాంతులకు గురయ్యారు. రంగంలోకి దిగిన పోలీసులు ఆ ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు.

చిత్తూరులో ఐదు దశాబ్దాలుగా ఓ ఇద్దరు వ్యక్తులు గంజాయి విక్రయాల్లో ఆరితేరారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆ ఇద్దరూ చిత్తూరు నుంచి తిరుపతికి వచ్చి డబ్బు పంపిణీలో కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం. డబ్బుతో పాటు యువతను గంజాయికి అలవాటు చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం చిత్తూరు నుంచి తిరుపతికి వచ్చిన గ్యాంగ్ నగరంలో తిష్టవేసి గంజాయిని విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. తాజాగా చంద్రగిరి నియోజకవర్గం, పాకాల మండలానికి గంజాయి సరఫరా పాకినట్లు విశ్వసనీయ సమాచారం. చిత్తూరు నుంచి వచ్చిన ఇద్దరు స్మగ్లర్లు తిరుపతి పరిసర ప్రాంతాల్లో విచ్చలవిడిగా గంజాయిని విక్రయిస్తూ.. యువతను మత్తుకు బానిసలుగా మారుస్తున్నట్లు పోలీసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గంజాయి మత్తులో పట్టుబడిన యువకులు



అద్దం ధ్వంసమైన స్కూల్ బస్సు

స్మగ్లర్ల ఆటకట్టిస్తాం

గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాం. ఎక్కడి నుంచి వస్తుంది, ఎక్కడెక్కడికి సరఫరా అవుతుందనే విషయాలపై దృష్టి పెట్టాం. గంజాయి ప్రధాన స్మగ్లర్లు, వారి నుంచి ఎవరెవరికి సరఫరా అవుతోందో తెలుసుకుంటున్నాం. ఇక వారందరి ఆటకట్టిస్తాం. ఇప్పటికే కొందరిని అరెస్టు చేసి కేసులు నమోదు చేశాం.

– రాజేంద్ర, అడిషనల్ ఎస్పీ, సెబ్, తిరుపతి జిల్లా

విష సంస్కృతికి బీజం వేయొద్దు



రమేష్‌ను పరామర్శిస్తున్న ఎంపీ గురుమూర్తి, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

- టీడీపీ కార్యకర్తల దాడిలో వైఎస్సార్‌సీపీ వార్డు మెంబర్‌కు గాయాలు
- పరామర్శించిన ఎంపీ, మాజీ ఎమ్మెల్యే



గాయపడిన రమేష్

శ్రీకాళహస్తి: 'ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజం. గెలిచిన వాళ్లు ఎల్లకాలం ఉంటారని గ్యారంటీ లేదు. కానీ ఓడిన వారిపై దాడులు చేసే సంస్కృతికి ఈ కూటమి ప్రభుత్వం బీజం వేసింది. ఇది మంచి పద్ధతి కాదు' అని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హితవుపలికారు. శ్రీకాళహస్తి మండలం, అక్కుర్తి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ వార్డు మెంబర్ రమేష్‌పై టీడీపీ కార్యకర్తలు శుక్రవారం రాత్రి దాడిచేశారు. విషయం తెలుసుకున్న ఎంపీ, మాజీ ఎమ్మెల్యే శనివారం స్థానిక ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. అక్కడ చికిత్స పొందుతున్న రమేష్‌ను పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మేమున్నామని ధైర్యం చెప్పారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్నికలైన తరువాత ప్రశాంతంగా ఉండాలన్నారు. అందరూ కలసిమెలసి అన్నదమ్ముల్లా జీవించాలని చెప్పారు. ఇలా రాజకీయ కక్షలతో దాడి చేయడం మంచి సంస్కృతి కాదని హితవుపలికారు. ప్రజలకు మంచి పాలన అందించి సేవ చేయాల్సింది పోయి.. కక్షలు, కుట్రలకు తెరలేపడం సరికాదన్నారు. తాము చట్టపరంగా పోరాటం చేస్తామని స్పష్టంచేశారు. అధైర్యపడొద్దు..అండగా ఉంటామని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాలు ఒకేలా ఉండవని, మారుతుంటాయని, ఇలా దాడులు చేయడం సరికాదన్నారు. గ్రామాల్లో శాంతి భద్రతలు పరిరక్షించాల్సిన ప్రభుత్వ పెద్దలే ఇలా దాడులు ప్రోత్సహించడం విడ్డూరంగా ఉందన్నారు. దాడుల సంస్కృతికి ఫుల్‌స్టాప్ పెట్టాలని కోరారు.

జనబాహుళ్యంలోకి మరిన్ని అన్నమయ్య కీర్తనలు

- టీటీడీ ఈఓ శ్యామలరావు



అధికారులతో సమీక్షిస్తున్న టీటీడీ ఈఓ శ్యామలరావు

తిరుపతి(అలిపిరి): పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు రచించిన 32 వేల సంకీర్తనలలో కొన్ని వేల సంకీర్తనలు మాత్రమే పరిష్కరించబడ్డాయని.. ఇంకా అపరిష్కృతంగా ఉన్న సంకీర్తనలను పరిష్కరించి జన బాహుళ్యంలోకి తీసుకురావాలని టీటీడీ ఈఓ జె.శ్యామలరావు అధికారులను కోరారు. తిరుపతి టీటీడీ పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో టీటీడీ పలు ప్రాజెక్టుల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం ఈఓ మాట్లాడుతూ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్ని కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. అన్నమయ్య రచించిన 32 వేల సంకీర్తనలలో ఎన్ని సంకీర్తనలు పరిష్కరించారు, ఎన్ని పరిష్కరించాలి, పరిష్కరించడానికి ఎంత సమయం పడుతుంది..? తదితర అంశాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమాలను సంబంధిత అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈఓకు వివరించారు. వీటిపై సిబ్బందికి ఈఓ పలు సూచనలు చేశారు. ఈ సమీక్షలో జేఈఓ గౌతమి, హెచ్‌డీపీపీ ప్రోగ్రాం అధికారి రాజగోపాల్, దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి ఆనందతీర్థచార్యులు, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు విభీషణశర్మ తదితరులు పాల్గొన్నారు.

కుమారునికి ఉరివేసి, తల్లి ఆత్మహత్య

- భర్త మరణంతో విరక్తి చెంది అకృత్యం
- బెంగళూరులో విషాదం
- మృతులు తిరుపతి వాసులు!



కుమారుడు భార్గవ్, తల్లి రమ్య (ఫైల్)

బనశంకరి: భర్త మరణించి పుట్టెడు దుఃఖంలో ఉన్న మహిళ జీవితంపై విరక్తి చెందింది. పేగు తెంచుకుని పుట్టిన కుమారున్ని హత్యచేసిన తరువాత తల్లి ఆత్మహత్య చేసుకుంది. మనసులను కలిచివేసే ఈ ఘోర దుర్ఘటన బెంగళూరులో యలహంక పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. యలహంక ఆర్ఎంజెడ్ అపార్టుమెంట్‌లో పులివర్తి శ్రీధర్ (47), రమ్యా (40), వారి కుమార్తె (20), కుమారుడు భార్గవ్ (13) నివాసం ఉంటున్నారు. వీరి స్వస్థలం తిరుపతి ప్రాంతమని తెలిసింది. శ్రీధర్ ఐటీ ఇంజినీరుగా పనిచేసేవారు. మూడు నెలల క్రితం పులివర్తి శ్రీధర్ క్యాన్సర్‌తో మరణించారు. అప్పటి నుంచి రమ్యా భర్తను తలచుకుంటూ మనో వ్యాకులతకు గురైంది. గత నెల 19వ తేదీన నగరంలోనే పీజీ హాస్టల్లో ఉన్న కుమార్తెతో రమ్యా ఫోన్‌లో మాట్లాడి బాధపడింది. ఈ నేపథ్యంలో రమ్యా పోలీసులకు, డాక్టరు, కుమార్తెకు లేఖ రాసి, అపార్టుమెంటులో కుమారుడు భార్గవ్‌ను ఉరివేసి హత్యచేసిన తరువాత రమ్యా కూడా ఉరి బిగించుకుని ప్రాణాలు వదిలింది. సమాచారం అందిన వెంటనే యలహంక పోలీసులు చేరుకుని మృతదేహాలకు శవపరీక్ష నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

వైభవంగా పార్వేట ఉత్సవం

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి పార్వేట ఉత్సవం శ్రీవారి మెట్టు సమీపంలో శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ఆలయం నుంచి ఉత్సవమూర్తుల ఊరేగింపు శ్రీవారిమెట్టు సమీపంలోని పార్వేట మండపానికి చేరుకుంది. అక్కడ నివేదన చేసి పార్వేట ఉత్సవం నిర్వహించారు. ఇందులో దుష్టశిక్షణ కోసం స్వామివారు మూడు సార్లు బళ్ళాన్ని ప్రయోగించారు. ఆస్థానం అనంతరం సాయంత్రానికి స్వామివారి ఉత్సవమూర్తులను తిరిగి ఆలయానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో కళాకారులు భక్తి సంకీర్తనలు ఆలపించారు. భజనలు, కోలాటాలు ఆకట్టుకున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ స్పెషల్ గ్రేడ్ డెప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్లు చెంగల్రాయలు, వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



ఉత్సవం అనంతరం తిరిగి ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న కల్యాణ వెంకన్న

పెండింగ్ సమస్యల పరిష్కారానికి చర్యలు



ఐఐటీ ప్రాంగణ మ్యాప్‌ను తిలకిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ఏర్పేడు: ఐఐటీ తిరుపతి పెండింగ్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతామని కలెక్టర్ వెంకటేశ్వర్ హామీ ఇచ్చారు. శుక్రవారం మండలంలోని ఐఐటీ తిరుపతిలో జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్రతో కలిసి సమావేశం నిర్వహించారు. ముందుగా ఐఐటీ డైరెక్టర్ కేఎన్.సత్యనారాయణతో కలిసి కలెక్టర్, జేసీలు ఐఐటీ ప్రాంగణ మ్యాప్‌ను తిలకించారు. ఐఐటీలోని విద్యార్థుల తరగతి గదులు, ల్యాబ్‌లు, వసతి గృహాలు, భవన నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం డైరెక్టర్ క్యాంపస్ పురోగతిపై కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ అంశాలు, భూసంబంధిత, ఇతర సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఐఐటీ తిరుపతి డిప్యూటీ రిజిస్ట్రార్ చమన్‌మెహతా, అధ్యాపకులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



మృతిచెందిన హేమలత

చంద్రగిరి(తిరుచానూరు): వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం మంగళం గ్రామ పంచాయతీలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. హేమలత(30)కు వివాహమై ఆమె భర్త సుబ్బు పిల్లలు పుట్టగానే వారిని వదిలి వెళ్లిపోయాడు. ఇటీవల బొమ్మల క్వార్టర్స్‌లో పనులు చేసుకునే విజయ్‌తో గత కొంతకాలంగా హేమలత సహజీవనం చేస్తోంది. శనివారం ఉదయం విజయ్ ఇంటి వెలుపల ఉండగానే హేమలత కిటికీ, తలుపులకు గడియ పెట్టి ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుని మృతి చెందింది. మృతురాలికి కుమారుడు సాగర్, కుమార్తె యశస్విని ఉన్నారు. హేమలత సోదరుడు ఇచ్చిన ఫిర్యాదుతో తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

అయ్యో..పాపం!

- మిల్లర్ కింద పడి మహిళా కూలీ మృతి
- అందరూ చూస్తుండగానే ఘటన

సూళ్లూరుపేట: వాళ్ల రెక్కాడితేగానీ డొక్కాడని రోజువారి కూలీలు. బతుకుదెరువు కోసం కొడుకును వెంటబెట్టుకుని బేల్దారి పనికోసం ఊరుగాని ఊరు వచ్చింది. మిల్లర్‌లో నీళ్ల పోసే క్రమంలో చీర చుట్టుకుపోవడం.. ఆపై వెంట్రుకలు చుట్టుకోవడం క్షణాల్లో జరిగిపోయింది. తర్వాత తల ఇరుక్కుపోవడం.. మిల్లర్ తిరుగుతున్నప్పుడే ఆ మహిళా కూలీ తల, మొండెం వేరుకావడం జరిగిపోయింది. కేకలు పెడుతూ.. ఆమెను కాపాడేందుకు తోటి కూలీలు సాయశక్తులా ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఈ విషాద ఘటన సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ వీధిలోని ఓ ఇంటికి స్లాబ్ వేయడానికి సూళ్లూరుపేట పరిసర ప్రాంతాల నుంచి మేస్త్రి తొండా రమణయ్య సుమారు 20 మంది కూలీలను కుదుర్చుకున్నారు. ఇందులో చిట్టమూరు మండలం, కుమ్మరిపాళెంకు చెందిన ఎర్రబోతు ఇందిరమ్మ కూడా తన కుమారుడితో కలిసి శనివారం ఉదయం బేల్దారి కూలిపనికి వచ్చింది. మేస్త్రి రమణయ్య వారిని మిల్లర్ వద్ద నీళ్ల పోయడానికి నియమించారు. పనిచేస్తుండగానే నీళ్ల పట్టే క్రమంలో ఆమె చీర మిల్లర్‌లో తిరుగుతున్న ఓ రాడ్‌కు చుట్టుకుపోయింది. ఆపై వెంట్రుకలు చుట్టుకుపోయి తల, మొండెం వేరయ్యింది. ఈ హృదయవిదారకర దృశ్యాన్ని చూసిన స్థానికులు చలించిపోయారు. తోటి కూలీలు కన్నీరుమున్నీరుగా విలపించారు. అప్పటి దాకా ఆడుతూ పాడుతూ పనిచేసిన ఇందిరమ్మ కేవలం 20 సెకండ్ల వ్యవధిలోనే విగతజీవిగా మారింది. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ కే.రహీంరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదవశాత్తు మరణించినట్టుగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.



మిల్లర్ కింద పడి నలిగిపోయిన మహిళా కూలీ

మహిళ హత్య



మృతి చెందిన ప్రసన్న

చంద్రగిరి(తిరుచానూరు): ఇంట్లో ఉన్న మహిళను గుర్తుతెలియని వ్యక్తి హత్య చేసిన ఘటన తిరుచానూరు పోలీసు స్టేషన్ పరిధిలోని వేదాంతపురం పంచాయతీ విద్యుత్ నగర్‌లో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కడప జిల్లాకు చెందిన బాలిరెడ్డి, ప్రసన్న(59) దంపతులు. గత 14 ఏళ్లుగా విద్యుత్ నగర్‌లో నివాసముంటున్నారు. స్థానికంగా ఉండే వాహన పార్కింగ్ కేంద్రంలో వాచ్‌మన్‌గా ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల బాలిరెడ్డి వ్యక్తిగత పనులపై స్వగ్రామానికి వెళ్లారు. ఇంట్లో ఆమె భార్య ప్రసన్న ఒక్కటే ఉంటోంది. ఈ క్రమంలో శనివారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడి ప్రసన్నపై కత్తితో దాడి చేసి గొంతుపై పొడిచారు. తీవ్రంగా గాయపడిన ప్రసన్న అక్కడికక్కడే మృతి చెందింది. తిరుచానూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అయితే హత్యకు గల కారణాలు తెలియరాలేదు. ప్రసన్నను చంపాల్సిన అవసరం ఏమొచ్చింది, ఎందుకు చంపారు.. అన్న కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

శోభాయమానం



జగన్నాథ శోభా యాత్రలో భక్తుల కోలాహలం

గూడూరు రూరల్: గూడూరు పట్టణంలో శనివారం జగన్నాథుని రథ యాత్ర శోభాయమానంగా సాగింది. ప్రతి ఏడాదీ నెల్లూరులోని ఇస్కాన్ కేంద్రం వారి ఆధ్వర్యంలో ఈ శోభాయాత్ర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పట్టణంలోని సొసైటీ సెంటర్‌లో ఉన్న నారాయణమ్మ దేవస్థానం నుంచి బయల్దేరిన ఈ శోభా యాత్రకు కూరగాయల మార్కెట్టు వద్ద మైథిలీ హాస్పిటల్ యాజమాన్యం ఘన స్వాగతం పలికింది. భక్తులకు మంచి నీరు, మజ్జిగ ప్యాకెట్లను అందించింది. ఆ తరువాత సంగం థియేటర్ మీదుగా బొడ్డుచౌక నుంచి గాంధీబొమ్మ సెంటర్‌కు శోభాయాత్ర చేరుకోవడంతో అక్కడ ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమిశెట్టి చెంచురామయ్య తదితరులు భక్తులకు వాటర్ బాటిళ్లు, లడ్డూ ప్రసాదాలు పంచిపెట్టారు. పందరి భజన, కోలాటం, మంగళవాయిద్యాలు, చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నారు.

భక్తులకు పారదర్శకంగా దర్శనం, వసతి

- మధ్యవర్తులు, దళారీల బెడద లేకుండా చర్యలు

తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు టీటీడీ కల్పిస్తున్న దర్శనం, వసతి తదితర సేవలు దళారుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా అందించేందుకు టీటీడీ చర్యలు తీసుకుంది. ఏడాదిగా ఆన్‌లైన్‌లో రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, డిప్, వసతి, ఆర్జిత సేవాలు, వర్చువల్ సేవలు, ఆఫ్‌లైన్‌లో (ఎస్ఎస్‌డీ టోకెన్లు, వసతి) తదితర సేవల బుకింగ్‌లపై ఇటీవల టీటీడీ విచారణ జరిపింది. ఇందులో ఒకే మొబైల్ నంబర్, మెయిల్ ఐడీలు ఉపయోగించి మధ్యవర్తులు బల్క్ బుకింగ్ పొందినట్లు గుర్తించింది. కరెంట్ బుకింగ్‌లో ఒకే మొబైల్ నంబర్‌తో 110 గదులు, 124 బుకింగ్స్ సంబంధించి 12కు పైగా గదులు పొందినట్లు అధికారుల విచారణలో నిర్ధారణ అయింది. అదేవిధంగా ఆన్‌లైన్ బుకింగ్‌లో ఒకే మొబైల్ నంబర్‌ను ఉపయోగించి 807 వసతి బుకింగ్‌లు, ఆన్‌లైన్‌లో ఒకే ఈమెయిల్ ఐడీని ఉపయోగించి 926 వసతి బుకింగ్‌లు, ఒకే మొబైల్ నంబర్‌ని ఉపయోగించి ఒక సంవత్సరంలో 1,279 డిప్ రిజిస్ట్రేషన్‌లు, ఒకే మెయిల్ ఐడీని ఉపయోగించి ఒక సంవత్సరంలో 48 డిప్ రిజిస్ట్రేషన్‌లు, ఒకే ఐడీ ప్రూఫ్‌ని ఉపయోగించి 14 ఎస్ఎస్‌డీ సర్వసర్వదర్శనం టోకెన్లు పొందినట్లు గుర్తించారు.

సేవల్లో మరింత పారదర్శకత

భక్తులకు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, టీటీడీ అందిస్తున్న సేవలలో పారదర్శకతను మరింతగా పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ సేవలను మరింత మెరుగుపరిచి ఆఫ్‌లైన్‌లో, ఆన్‌లైన్‌లో టికెట్లు పొందే దళారులు, మధ్యవర్తులపై టీటీడీ చర్యలు చేపట్టింది. ఇందులో బల్క్ బుకింగ్‌లకు ఉపయోగించే మొబైల్ నంబర్‌లు, ఈమెయిల్‌లు, ఐడీ ప్రూఫ్‌లు రద్దు చేసింది. సరైన ధ్రువీకరణ కోసం ఆధార్ సేవలను ఉపయోగించేలా టీటీడీ ప్రయత్నాలు చేపడుతోంది.

నిందితుడి అరెస్ట్

ఏర్పేడు: మండలంలోని మూలకంద్రిగలో ఓ బాలికపై అత్యాచారం చేసిన ఘటనలో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. ఈ నెల 7న మూలకంద్రిగ గ్రామానికి చెందిన బలరామయ్య అదేగ్రామానికి చెందిన ఓ బాలికకు చాక్లెట్స్ ఇచ్చి అత్యాచారం చేయడంపై బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఈ క్రమంలో నిందితుడుని అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. విచారణానంతరం కోర్టుకు పంపనున్నట్లు సీఐ చెప్పారు.

పదవులు అనుభవించి విమర్శలా?

- పెద్దాయన హయాంలోనే అత్యధిక పదవులు
- ఆయన చలువతోనే ఎంపీపీ, జెడ్పీటీసీ పదవులు ఇచ్చారు
- ఇప్పుడు పార్టీ మారి విమర్శలు చేయడం విడ్డూరం
- సీడీసీఎంఎస్ మాజీ చైర్మన్ సహదేవరెడ్డి



సహదేవరెడ్డి, సీడీసీఎంఎస్ మాజీ చైర్మన్

భాకరాపేట: పార్టీలో ఉన్నప్పుడు ఆశించిన పదవులు అనుభవించి ఇప్పుడు ఆ పార్టీపైనే విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని సీడీసీఎంఎస్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి సామకోటి సహదేవరెడ్డి మండిపడ్డారు. శనివారం చిన్నగొట్టిగల్లులో ఆయన విలేకరులతో మాట్లాడారు. పుంగనూరు నియోజకవర్గం, పులిచెర్ల మండలానికి చెందిన జెడ్పీటీసీ మురళీధర్ వైఎస్సార్‌సీపీ విధివిధానాలను తప్పుపట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హయాంలోనే మురళీధర్ పులిచెర్ల మండలానికి ఎంపీపీ, జెడ్పీటీసీ పదవులతో పాటు, పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ పదవిని అనుభవించారని గుర్తు చేశారు. ఇలాంటి వారు కూడా పార్టీని వీడడంతో పాటు తల్లిలాంటి వైఎస్సార్‌సీపీపైనే విమర్శలు చేయడం వారి దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. పార్టీ నాయకులు మారినంత మాత్రాన పార్టీ కేడర్ మారదన్నారు.

జిల్లాలో 932.6 మి.మీ వర్షం

తిరుపతి అర్బన్: జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు 932.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు. సగటున జిల్లాలో 27.4 మి.మీ వర్షం కురిసినట్టు వెల్లడించారు. అత్యధికంగా నారాయణవనం మండలంలో 65.2 మి.మీ, అత్యల్పంగా డక్కిలి మండలంలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

షార్ట్ సర్క్యూట్‌తో ఫ్యాన్సీ దుకాణం దగ్ధం



మూడో అంతస్తుకు ఎగబాకిన మంటలు

గూడూరు రూరల్: షార్ట్ సర్క్యూట్ కారణంగా మూడు అంతస్తుల్లో ఉన్న ఫ్యాన్సీ స్టోర్ అగ్నికి ఆహుతైంది. ఈఘటన స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. వివరాలు.. కుమ్మర వీధిలో సూర్య ఫ్యాన్సీ దుకాణం ఎన్నో ఏళ్లుగా ఉంది. శుక్రవారం రాత్రి అన్ని స్విచ్‌లు ఆఫ్ చేసి తాళాలు వేసుకుని యజమానులు ఇంటికి వెళ్లారు. వేకువజామున దుకాణంలోని కింద అంతస్తులో విద్యుత్ షార్టు సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి. పక్కన ఉన్న వారు గమనించి దుకాణ యజమానులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. చివరకు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేసే ప్రయత్నం చేస్తుండగానే రెండో అంతస్తులోకి మంటలు వ్యాపించాయి. ఈలోగా అగ్నిమాపక వాహనంలో నీరు అయిపోవడంతో మళ్లీ నీరు నింపుకుని వచ్చేందుకు వెళ్లేలోపు మూడో అంతస్తులోకి మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక ఇన్‌చార్జ్ అధికారి విజయకుమార్ కోట, నాయుడుపేట పట్టణం నుంచి మరో రెండు అగ్నిమాపక వాహనాలను పిలిపించి సుమారు ఐదు గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.కోటి వరకు నష్టం వాటిల్లి ఉండవచ్చని యజమాని తెలిపారు.